# మహోత్సురాలు

ఆ ఆస్పత్రి ఎదురుగా కార్‌పార్కింగ్ దగ్గర సూర్యనారాయణ నిలబడి చూస్తున్నాడు తమ బాస్‌గారి కోసం. ఆయన బంధువును చూడటానికి వచ్చాడు. తను మెట్లెక్కి గబగబా క్రిందకు దిగాడు. 'మరి లిఫ్టులో బయలు దేరిన ఆయన ఇంకా రాలేదేమిటా!' అని నించున్నాడు.

సూర్యనారాయణకు బాస్ శంకరయ్య గారంటే చాలా ఇష్టం. ఆయన బదిలీపై ఆ ఆఫీసుకు వచ్చి రెండు నెలలే అయినా ఆయనకు దగ్గరై పోయాడు. తను ఆయన కారు డ్రైవరు ఎంతోమంది అధికారులను చూసాడు. కాని ఆయనలా క్రిందిస్థాయి ఉద్యోగస్తులతో స్నేహపూర్వకంగా మెలిగేవారు అరుదు అనుకున్నాడు సూర్యనారాయణ.

అలా సూర్యనారాయణ ఆలోచనల్లో ఉండగానే శంకరయ్యగారు వచ్చారు. ఆయన ముఖం వాడిపోయి కనిపించింది సూర్యనారాయణకు.

'ఆయన బంధువు ఆరోగ్యం బాగానే ఉందన్నారు. త్వరలో డిశ్చార్జి కాబోతున్నారు. మరి ఎందుకో ఆయన ఇంత డల్ అయ్యారు!' అనుకున్నాడు.

"సార్! బాగా నీరసంగా కనిపిస్తున్నారు. కాఫీ తెమ్మంటారా?" అడిగాడు తన బాస్‌ను.

"వద్దులే. పద ఆఫీసుకు టైమవుతోంది!" అన్నాడు. కారు కదిలింది. సూర్యనారాయణ మెల్లగా పోనిస్తున్నాడు కారు ఆ ఆస్పత్రి ఆవరణ దాటి హైవే మీదుగా వెళుతోంది.

ఉదయం తొమ్మిది దాటింది. శీతాకాలపు నీరెండ. శంకరయ్యగారు భారంగా కళ్ళు మూసుకుని నడుం వెనక్కి వాల్చారు. పది నిమిషాల తర్వాత కళ్ళు తెరిచిన శంకరయ్యగారికి రోడ్డు ప్రక్కన పూల దుకాణం కనిపించింది.

"కారు ఆపు, ఒక బొకే తీసుకో! ఆ తెల్ల గులాబీలతో పూలకుండీలా ఉన్నది." అంటూ వంద రూపాయల కాగితం అందించాడు.

"ఈ రోజు రామారావుగారి సన్మానం కోసమా! నిన్ననే మన ఆఫీసు వాళ్ళు ఆర్డరిచ్చేసారు సార్. నేనే మన ఆఫీసు ప్రక్కనున్న ఫ్లోరస్ట్రీలోనే చెప్పా!" అన్నాడు సూర్యనారాయణ.

"ఇది ఆయన కోసం కాదులే!" అన్నారు శంకరయ్యగారు. మరి ప్రశ్న వెయ్యకుండా ఆ బొకే జాగ్రత్తగా ప్యాక్ చేయించి కారు వెనుక సీట్లో పెట్టించాడు సూర్యనారాయణ. మరో పది నిముషాల్లో కారు ఆఫీసుకు చేరుకుంది.

ఆఫీసు పక్కనే ఉన్న బట్టల దుకాణం వైపు చూసి "ఒక మంచి శాలువా తీసుకురా!" అని డబ్బు లిచ్చారు సూర్యనారాయణకు.

అంతలోనే మళ్ళీ ఆలోచనలో పడి "వద్దులే.. నేనూ వస్తా!" అంటూ బట్టల దుకాణంలోకి నడిచి, నాలుగైదు శాలువాలు చూసి బాగా ఖరీదైన శాలువా కొన్నారు శంకరయ్య.

'నిన్ననే రెండు శాలువాలు కొన్నాం. మళ్ళీ ఎందుకు?' అన్నమాటలు నోటి చివరి వరకూ వచ్చి ఆగిపోయాయి సూర్యనారాయణకు.

బ్రీఫ్‌కేసు, టిఫెన్ బాక్స్ తీసుకుని ముందుకు నడిచాడు సూర్య నారాయణ. ఆయన అతడికన్నా ముందు గబగబా నడుస్తూ ఆఫీసులోని తన క్యాబిన్ లోనికి నడిచారు. అప్పటికే పది దాటింది. పావుగంట తర్వాత ఆఫీసు సూపర్నెంటు కాంతారావు వచ్చాడు.

"సార్! మన అనకాపల్లి బ్రాంచి మేనేజరు రామారావుగారు ఈ రోజే రిటైరవుతున్నారు. మీకు తెలీదని కాదు. వారికి హెూటల్ మయూరిలో సన్మానం, సన్మానం తర్వాత అందరికీ డిన్నర్. గుర్తు చేస్తున్నాను!" అన్నాడు.

"సరే సన్మానానికి హాజరవుతాను. అయితే ఆయన గురించి నాకేమీ

తెలియదు. నేను ఈ ఆఫీసుకొచ్చి రెండు నెలలేగా అయింది. ఆయన గురించి సభలో ఏం మాట్లాడాలి?'' అన్నారు శంకరయ్య.

“రామారావుగారి గురించి తెలియంది ఏముంది? ఆయన వర్క్‌హాలిక్. పని తప్ప వేరే ధ్యాస లేదు. ఆయన తన ముప్పైయ్యేళ్ళ సర్వీసులో ఒక్కసారీ సెలవు పెట్టలేదు. రికార్డు గుమాస్తాగా సర్వీసులో చేరి బ్రాంచి అధికారిగా రిటైరవుతున్నారు!'' అన్నాడు సూపర్నెంటు.

“ముప్పైయ్యేళ్ళ సర్వీసులో ఒక్కసారీ సెలవు పెట్టలేదా!'' అన్నారు శంకరయ్యగారు ఆశ్చర్యంగా.

“నిజంగా సార్. కావలిస్తే ఆయన సర్వీసు రిజిష్టరు చూడండి!'' అంటూ ఒక లావుపాటి పుస్తకం అందించాడు సూపర్నెంటు. శంకరయ్యగారు పుస్తకం తెరిచారు. 1979లో రామారావు రికార్డు గుమాస్తాగా ఉద్యోగ జీవితం మొదలయ్యింది. ఈ ముప్పైయ్యేళ్ళలోనూ ఏ సెలవూ వాడుకోలేదు. వివరంగా రాసిన ఆ విషయం చూసి శంకరయ్య మళ్ళీ ఆశ్చర్యానికి లోనయ్యారు.

మైగాడ్! ఇది రికార్డే. గిన్నీస్ బుక్‌లోకి ఎక్కించాల్సిన విషయం అనుకున్నారు శంకరయ్యగారు. ఆ పుస్తకం క్షుణ్ణంగా పరిశీలించి, అంతలోనే ఆయన మనసులో ఏదో తెలీని బాధ ఆవరించింది. రిజిష్టరు మూసి సూపర్నెంట్‌తో

“సాయంత్రం మయూరి హొటల్‌కు డైరెక్ట్‌గా వచ్చేస్తాను, మీరు సన్మానం ఏర్పాట్లు పూర్తి చేసెయ్యండి!'' అన్నారు.

* * *

సాయంత్రం మయూరి హొటల్ స్టేజీ మీద 'పదవీవిరమణ చేస్తున్న రామారావుగారికి వీడ్కోలు' అనే బ్యానరు. వేదిక మీద మూడు కుర్చీలు. శంకరయ్యగారు చుట్టూ చుసారు.

సభ ముందు వరుసలో కూర్చున్న రామారావుని విష్ చేసి ఆయన పక్కనే కూర్చున్నారు, శంకరయ్య.

కంపెనీ పబ్లిక్ రిలేషన్ ఆఫీసరు ముఖర్జీ ఇంగ్లీషులో స్వాగతోపన్యాసం చేసాడు. రామారావుగారిని, శంకరయ్యగారిని స్టేజీ మీదకు ఆహ్వానించాడు. పూలదండలు, బొకేలతో రామారావుని సత్క రించారు. అతడి సహచరులు ఒక జ్ఞాపికను బహూకరించారు. ఆ తర్వాత శాలువా కప్పారు. స్థానిక టి.వి. ఛానల్ వారొచ్చి వీడియో తీసారు. రామారావుతో పనిచేసిన అతడి స్నేహితులు అతడిని ఆకాశానికి ఎత్తేశారు.

"ఒక్క సెలవు దినమూ తీసుకోకుండా ముప్పైయేళ్ళ సర్వీసు పూర్తి చేసిన రామారావు శ్రామికరత్న అనే బిరుదు ఇవ్వాలి." అన్నారు వక్తలు.

శంకరయ్యగారిని మాట్లాడమన్నారు. ఆయన కొంచెంసేపు ఆలోచనలో పడ్డారు. గొంతు సవరించుకుని మొదలెట్టారు. "రామారావు గారితో నాకు పరచయం తక్కువ. నేను చెన్నైలో పనిచేసి డివిజనల్ అధికారిగా ఈ ఆఫీసులో చేరి రెండు నెలలే అయింది. రామారావుగారు విధి నిర్వహణలో రాజీ లేకుండా పనిచేసినట్టు ఆయన రికార్డులే చెపుతున్నాయి. ముప్పైయేళ్ళ సర్వీసులో ఒక్కరోజూ లీవు లేకుండా పనిచేసిన ఆయన పేరు గిన్నీస్‌బుక్, లేదా లిమ్కా బుక్కులోకి ఎక్కేందుకు నేను ప్రయత్నం చేస్తాను!" అని ఆయన చెప్పడం పూర్తి చెయ్యకుండానే సభలో చప్పట్లు మ్రోగాడు. శంకరయ్యగారు మళ్ళీ కొన్ని క్షణాలపాటు సభ వంక కలయచూసి చెప్పడం మొదలెట్టారు.

"నిజంగా నాకు నమ్మకం కలగలేదు. ఆయన ఏ ఒక్కరోజూ సెలవు తీసుకోకుండా ఇన్ని సంవత్సరాలు ఎలా పనిచేశారా అని! అయినా అది వాస్తవం. అలాగే ఆయన ఏ రోజూ ఆఫీసుకు లేటుగా రాలేదనీ, ఏ రోజూ ఇంటికి ముందుగా వెళ్ళలేదనీ ఆయన సహచర ఉద్యోగుల ద్వారా విన్నాను."

మళ్ళీ సభలో చప్పట్లు! ఆ విరామంలో శంకరయ్యగారు తనకు

ముందుంచిన గ్లాసులోని నీళ్ళు గబగబా తాగేసారు. మళ్ళీ ఉపన్యాసం కొనసాగించారు. "అయితే ఒక ప్రశ్న! ఒక ఉద్యోగి గానీ, ఒక వ్యాపారి గానీ జీవిత పర్యంతం ఏ ఒక్క రోజూ సెలవు పుచ్చుకోకుండా పనిచేసే వీలుందా! తెల్లారి లేస్తే ఎన్ని సమస్యలు? పిల్లల చదువులు, అనారోగ్యాలు, ఇంట్లో తీర్చాల్సిన అవసరాలు, బంధువులు పిలిస్తే వెళ్ళాలి, ఇక పెళ్ళిళ్ళు, వేడుకలు చావులు. వీటి అన్నిటికీ ఎవరూ అతీతులు కారు. మరి వీటన్నిటినీ రామారావు గారు ఎలా తప్పించుకోగలిగారు?"

శంకరయ్యగారి మాటలతో ఆ ఆవరణ అంతా నిశ్శబ్దం. క్షణంసేపు ఆగి శంకరయ్యగారు, సూర్యనారాయణని పిలిచి మెల్లగా ఏదో చెప్పారు. గబగబా అతను అక్కడనుంచి వేగంగా కదిలాడు.

శంకరయ్యగారు మళ్ళీ గొంతు విప్పారు.

"అయితే ఇందాక నేను రామారావుగారితో మాట్లాడుతున్నపుడు తెలిసిన మరో విషయం! ఆయన ఇద్దరు అబ్బాయిలు బాగా చదువుకుని స్థిరపడ్డారనీ, కూతురి పెళ్ళి చేసేసారనీ. ఇంత ప్రణాళికాబద్ధంగా అటు కుటుంబాన్ని నడిపిస్తూ, ఆఫీసు చక్కబెట్టడం ఎలా సాధ్యమైంది? అన్న నా ప్రశ్నకు సమాధానంగా ఒక వ్యక్తి కనబడింది.. ప్రతీ మగవాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుంది. ఆయన వెనుక ఉన్నది మాత్రం ఆయన భార్య. అయితే ఆవిడా ఉద్యోగస్తురాలే!" మళ్ళీ సభలో నిశ్శబ్దం. చెప్పడం ఆపి శంకరయ్య గారు సభ అంతా పరిశీలనగా చూసారు. అంతవరకూ మౌనంగా ఆయన మాటలు వింటున్న రామారావు లేచి నిలబడ్డాడు. అతడి కళ్ళల్లో నీళ్ళు.

"ఔనండీ. నా విజయం వెనుక నా భార్యే ఉంది. ఆవిడా మనం కంపెనీలోనే పని చేస్తుందనేది మీకు తెలిసిన విషయమే. అయితే మీకు తెలీని విషయం- నేను నా సంసారం గురించి ఎప్పుడూ పట్టించుకోలేదనీ,

పిల్లల చదువులు, ఇంటిపనులు ఆవిడే చూసుకునేదనీ!'' ఆయన చెప్పడం ఆపి జేబు రుమాలుతో కళ్ళు తుడుచుకుని క్షణంసేపు మౌనంగా ఉండి పోయాడు.

ఆ తర్వాత మెల్లగా మళ్ళీ మాట్లాడటం మొదలెట్టాడు. ''నేను ఎప్పుడూ ఆఫీసుకు ఎర్లీ గోయింగ్, ఇంటికి లేట్ కమింగ్, అయితే మా ఆవిడ అందుకు వ్యతిరేకం. నేను ఆఫీసుకు సెలవు పెట్టకుండా ఆఫీసు పనులకు అంకితమై పై అధికారుల నుంచి నీరాజనాలు అందుకుంటుంటే, ఆవిడ ఇంటిపనులతో టెన్షన్ పడుతూ తరచూ సెలవులు పెడుతూ పై అధికారుల ఆగ్రహానికి గురయ్యేది. పిల్లల్ని తనే స్కూల్లో దింపేది. వారికి అనారోగ్యం కలిగితే తనే డాక్టరు దగ్గరకు పరిగెత్తేది. ఇక బంధువుల పెళ్ళిళ్ళు, వేడుకలు, చావు కబుర్లు అన్నిటికీ తనే హాజరయ్యేది. అలా నా కుటుంబంతో పాటూ నన్నూ సక్రమంగా ఉద్యోగం చేసుకునేలా నన్ను ప్రతీక్షణం కాపాడింది. అలాంటి ఆమెకు చివరికి నేను మిగిల్చింది...'' అంటూ రామారావు కన్నీరు కారుస్తూ కూలబడిపోయాడు. ఆ సభలో కొన్ని క్షణాలపాటు నిశ్శబ్దం. ఎవరూ నోరు విప్పలేదు. మళ్ళీ ఆయన చెప్పడం కొనసాగించారు.

''ఔను... రామారావుగారు చెప్పింది నిజమే! ఆయన భార్య తను ఉద్యోగం చేస్తూనే ఇన్ని బాధ్యతల్ని నిర్వర్తించింది. అయినా మనం రామారావు గారినే కీర్తిస్తున్నాం. ఆయనకు జేజేలు పలికి ఆయనను ఆకాశానికి ఎత్తుతున్నాం. ఆయన పేరు రికార్డుల్లోకి ఎక్కాలని ఆరాటపడుతున్నాం. ఇలా అంటున్నందుకు క్షమించండి!'' అంటూ ఆయన ఒక్కక్షణం గుండెల్నిండా ఊపిరి పీల్చి వదిలి సభ అంతా కలియచూసి మళ్ళీ చెప్పడం మొదలెట్టాడు.

''మహాత్ముడు గొప్పవాడు. జాతిని నడిపించాడు. మనకు స్వేచ్ఛను ప్రసాదించాడు. మరి ఆయన ప్రశాంతంగా ఆ మహా యజ్ఞాన్ని నిర్వర్తించే క్రమంలో ఆయన కుటుంబాన్ని నడిపించిన ఆ మహాత్మురాలిని మాత్రం

మరచిపోతున్నాం!'' అంటూ ఆయన ఆగారు. ఒక్కసారిగా ఆ ఫంక్షన్ హాల్‌లో గడ్డ కట్టినట్టుగా నిశ్శబ్దం. అందరూ తలలు వంచుకున్నారు. శంకరయ్యగారు గొంతు విప్పారు.

''నేను ఈ రోజు ఉదయం ఒక ఆస్పత్రికి వెళ్ళాను మా బంధువును చూడటానికి. ఆయన పక్కనే ఒక పేషంటు. యాభయ్యేళ్ళకే వచ్చిన ముసలి తనం. గతంలో చూసిన ముఖమే. అయినా నేను గుర్తు పట్టలేకపోయాను. ఆవిడ మన కంపెనీలోనే పని చేస్తున్న వ్యక్తి. నన్ను గుర్తు పట్టింది. భర్త ఉద్యోగానికి, తన కుటుంబానికి తానే దిక్కయ్యి వెన్నుదున్నగా పనిచేసిన క్రమంలో ఆమెకు వెన్నుపూస పనిచెయ్యడం మానేసింది. దానితో ఆమెకు నడుం పడిపోయింది. ఈపాటికి ఆవిడ ఎవరో మీకు అర్థమయ్యే ఉంటుంది. ఆవిడే మనం మరచిపోయిన మహాత్మురాలు. భర్త ఉద్యోగాన్నీ కుటుంబాన్నీ దిగ్విజయంగా నడిపించిన ఆమె ఇప్పుడు నడపలేకపోతోంది. అదిగో చూడండి...'' అన్నాడు. సభలోని వారంతా తల తిప్పారు. చక్రాల కుర్చీలో వస్తున్న ఒక మహిళ- తల పండిపోయి, యాభయ్యేళ్ళకే ముసలి రూపంలో ఉన్న ఆమె రామారావుగారి భార్య, ఆమెను ఆస్పత్రి నుంచి కారులో తీసు కొచ్చిన సూర్యనారాయణ చక్రాల కుర్చీలో స్టేజీమీదకు తీసుకొచ్చాడు.

ఉదయం తను కొన్న పూల గుత్తిని ఆమెకు అందించి ఆమెపై శాలువా కప్పారు శంకరయ్యగారు. అందరూ లేచి నిలబడ్డారు. కరతాళ ధ్వనులతో ఆ సభ మారుమ్రోగింది.

రామారావు తన స్వార్థం కోసం, మెప్పుకోసం ఒక జీవితాన్ని కాదు, తన భార్య జీవితాన్ని పైశాచికంగా వాడుకున్నాడు. అందుకే ఆమె మహాత్ముల రాలైంది. దిద్దుకోవటానికి అవకాశంలేని జీవితపు తప్పుకి తలదించుకున్నాడు రామారావు.

*(చిత్ర సచిత్ర మాస పత్రిక డిసెంబర్ 2010)*